# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 21 మార్చి , 2026 | పేజీలు :08


## ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు




వివరాలు మెయిన్‌లో...

## దళిత సంక్షేమానికి భారీ కేటాయింపులు

### ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :**దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సాధికారతకు కేంద్ర బిందువుగా చేసుకుని సిఎం రేవంత్ రెడ్డి దూర దృష్టితో ఆర్థిక, డిప్యూటి సిఎం మల్లు బట్టి విక్రమార్క సమర్థ నాయకత్వంలో రూపొందించిన 2026–27 బడ్జెట్ సమాగ్రాభివృద్ధికి మార్గదర్శిగా నిలుస్తుందని ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రతిపాధించిన సామాజిక న్యాయం, సమాన అవకాశ లక్ష్యాలను ప్రతిబింబించే బడ్జెట్ అని మంత్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. షెడ్యూల్డ్ కులాలకు రూ. 11,784 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ. 7.935 కోట్లు కలిపి రూ. 19,721 కోట్లు భారీ కేటాయింపులు చేయడం అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత సామాజిక మౌళిక వసతుల అభివృద్ధికి రూ.368.27కోట్ల వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. సంక్షేమంలో భాగంగా దివ్యాంగుల వివాహాలను ప్రోత్సహిస్తూ రూ. 2లక్షల నగదు కానుక అందించడం ప్రభుత్వం సామాజిక భాధ్యతను చాటుందన్నారు. చేయూత పథకం కింద అర్హులైన వారికి 2లక్షల కొత్త ఫించన్లు మంజూరు చేస్తూ రూ. 14,861 కోట్లు కేటాయించడం ప్రజల జీవన భద్రతకు పెద్ద అడుగు అని వివరించారు. ఈ బడ్జెల్ కేవలం లెక్కల పత్రం కాదు.. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమం కలగలిపిన అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు నడిపించే కార్యాచరణ ప్రణాళిక బడ్జెట్ అని మంత్రి అ డ్లూరి లక్ష్మ ణ్ కుమార్ బడ్జెట్‌పై తన అభిప్రాయాన్నిఇలావివరించారు.

## గ్యాస్ సరఫరా పకడ్బందీగా సాగాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్ సిలిండర్ల సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వసతి గృహాల్లో అందుబాటులో ఉన్న గ్యాస్ సిలిండర్ల స్టాక్ వివరాలను కలెక్టర్ సమీక్షించారు.విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వసతి గృహంలో సరిపడ సిలిండర్ల నిల్వ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.గ్యాస్ ఏజెన్సీలు వసతి గృహాల అవసరాలకు అనుగుణంగా సమయానికి సరఫరా చేయాలని స్పష్టం చేశారు.వసతి గృహాల నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీ లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సరఫరా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత తహసీల్దార్లకు సమాచారం అందించాలని ఆదేశించారు.తహసీల్దార్లు తరచూ వసతి గృహాలను తనిఖీ చేసి గ్యాస్ సిలిండర్ల నిల్వను పరిశీలించాల్సిందిగా పేర్కొన్నారు.మండల స్థాయిలో తహసీల్దార్లు,వసతి గృహాలు అధికారులు,గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్,ఆర్‌డిఒ రత్నకళ్యాణి,జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్,డిఇఒ భోజన్న,ఎస్‌సి,ఎస్‌టి,బిసి మైనారిటీ శాఖల అధికారులు దయానంద్,అంబాజీ,శ్రీనివాస్,మోహన్ సింగ్ పాల్గొన్నారు.

## గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి :కలెక్టర్



వివరాలు మెయిన్‌లో...

## గేటుపడితే అంబులెన్స్ అయినా
# అరగంట ఆగాల్సిందే



మంగపేట రైల్వే గేటు వద్ద వాహనదారుల కష్టాలు

**ప్రజాపక్షం/గంగాధర:**అక్కడ రైల్వే గేటు పడితే సుమారు అరగంట ఆగాల్సిందే అత్యవసరంగా వెళ్లే అంబులెన్స్ అయినా, వాహనాలైనా గేటు తీసే వరకు నిరీక్షించాల్సిందే. ఎంత దూరం నుంచి వచ్చినా వాహనాలకు బ్రేక్ వేయాల్సిందే. గంగాధర మండలం మంగపేట శివారులోని తుర్కాశినగర్ వద్ద కరీంనగర్ జగిత్యాల ప్రధాన జాతీయ రహదారిపై టి/29 రైల్వే గేటు వద్ద ఎన్నో ఏళ్లుగా తిష్టవేసిన సమస్య ఇది. ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే తప్ప సమస్య తీరదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో రైల్వే గేటు పడిన సమయంలో భారీగా ట్రాఫిక్‌జాం అవుతోంది. జగిత్యాల , కోరుట్ల, మెట్‌పల్లి నుంచి ప్రజలు కరీంనగర్, హైదరాబాద్ వెళ్లేందుకు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే రైళ్ల రాకపోకలు సాగించే వేళల్లో ప్రతి సారి దాదాపు అరగంటకు పైగా రైల్వే గేటు పడుతుంది. దీంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కరీంనగర్, హైదరాబాద్‌కు ప్రతి రోజు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి పదుల సంఖ్యలో అంబులెన్స్‌లు ఇదే దారి గుండా వెళ్తుండడంతో రోగులు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే ట్రాక్ వల్ల రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మంగపేట (తుర్కాశినగర్) టి/29 గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు

**ఇబ్బందులు పడుతున్నాం:శ్రీమల్ల మేఘరాజు, వెంకటాయపల్లి, గంగాధర**

రైల్వే గేటు పడితే అరగంటకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది. వివిధ పనులపై కరీంనగర్ వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నాం. అత్యవసర వైద్య సేవల నిమిత్తం రోగులను తరలించే అంబులెన్స్‌లు సైతం అరగంట పాటు నిలిచిపోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

## గిరిజన యువతుల విక్రయం

### బెజ్జూర్ నుంచి మధ్యప్రదేశ్ కు తరలింపు
### పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

**ప్రజాపక్షం /కౌటాల :**జిల్లాలో మానవ అక్రమ రవాణా ముఠాలు పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గిరిజన యువతులను సంతలో సరుకులా విక్రయిస్తుండటం కలకలం రేపుతోంది. బెజ్జూర్ మండలానికి చెందిన ఇద్దరు గిరిజన యువతులను మాయమాటలతో నమ్మించి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి తరలించి విక్రయించినట్లు తెలుస్తోంది. ఒక్కో యువతిని రూ.2.50 లక్షల చొప్పున ముఠా సభ్యులు అమ్ముకున్నట్లు సమాచారం. బాధిత యువతుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు యువతుల అక్రమ రవాణా ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నేడో రేపో వీరి అరెస్టును చూపి పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. జిల్లాలో ఒంటరి మహిళలు, పేద కుటుంబాలకు చెందిన యువతులకు పెళ్లి, డబ్బు ఎరగా చూపి ఇతర రాష్ట్రాలకు తరలించడం పరిపాటిగా మారింది. తాజాగా బెజ్జూర్ యువతులను విక్రయించినట్లు గుర్తించిన ప్రత్యేక పోలీస్ బృందం బాధితులను విడిపించేందుకు మధ్యప్రదేశ్ వెళ్ళింది. ఈ ముఠాలో ఒక మహిళతో పాటు మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు పురుషులు ఉన్నట్లు సమాచారం. గతేడాది కూడా ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువతిని, మహబూబాబాద్ జిల్లాకు చెందిన మరో మహిళను ఇదే తరహాలో విక్రయించగా పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. తాజా ఘటనతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితులు ఎంతటి వారైనా కఠిన శిక్షలు అమలు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మెట్‌పల్లి కోర్టు భవనాల సూచిక బోర్డు ప్రారంభం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి కోర్టు భవనాలకు సంబంధించిన మార్గదర్శక సూచిక బోర్డును సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ కోర్టుకు వచ్చే ప్రజలకు ఈ బోర్డు ఉపయోగపడుతుందని తెలిపారు. కోర్టుకు సంబంధించిన పనుల్లో బార్ అసోసియేషన్ ముందుండి పనిచేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్‌తో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్,జాయింట్ కార్యదర్శి గజెల్లి రామ్ దాస్, లైబ్రరీ సెక్రటరీ పులి నర్సయ్య,మహిళా ప్రతినిధి ఆకుల మానస,ఈసీ సభ్యులుఇతరన్యాయవాదులు పాల్గొన్నారు.

## 24న క్రీడా పాఠశాలల ఎంపికలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఈ నెల 24న క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బండారి మధు శుక్రవారం తెలిపారు.రాష్ట్రంలోని హకీంపేట, హనుమకొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఈ ఎంపికలు జరుగుతాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన విద్యార్థులు అప్లికేషన్ ఫామ్‌తో పాటు వయసు ధృవీకరణ పత్రంతో ఉదయం 9 గంటలలోపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయి పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు .మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్లు రాజు,రవి లను సంప్రదించాలని ఎంఇఓ సూచించారు.

## నీటి సమస్యకు చెక్...



**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని మసీదు గడ్డ ప్రాంతంలో ఏర్పడ్డ నీటి సమస్యను కాలనీ వాసులు సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సర్పంచ్ పాలకవర్గంతో కలిసి శుక్రవారం నీటి సమస్యను తీర్చేందుకు మోటర్ పంపు సెట్‌ను ఏర్పాటు చేశారు. మూడవ వార్డు సభ్యురాలు రోజా మోటర్‌ను స్టార్ట్ చేసి ప్రారంభించగా, కాలనీ వాసులు పాలక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కుల నరేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్, వార్డు సభ్యులు భగవంతం, సురేష్, నవనీత, పద్మయ్య, సంజీవ్, దేవలక్ష్మి లావణ్య, గోరేమియా, ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

# ప్రణాళికా బద్ధంగా జనగణన

### జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత, రాజ గౌడ్




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :**జనగణన కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలనిజగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్ లత, రాజ గౌడ్‌లు పేర్కొన్నారు. జనగణన2027 కార్యక్రమంలో నిర్వాహణలో భాగంగా తొలి దశలో నిర్వహించనున్న హౌస్ సెన్సెస్ కు సబంధించిన అంశంపై కలెక్టర్ కార్యాలయంలో మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు హాజరై మాట్లాడారు. జనగణన కార్యక్రమంలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా, తప్పుడు సమాచారం అందించిన చట్ట ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్యుమరేటర్లకు జనగణనకు సంబంధించి అన్ని అంశాలలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. సాఫ్ట్‌వేర్ పనితీరు గమనించి ప్రతి అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా న్విహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్‌లో ప్రభుత్వసంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన గణాంకాలు సిద్ధమవుతాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంతో ఏవో హాకీం తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు గర్వకారణం

### నవోదయ సీటు సాధించిన విద్యార్థికి సర్పంచ్ ప్రత్యేక అభినందనలు

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామ పరిధిలోని రాజానగర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి డి. హర్షవర్ధన్ నవోదయ ప్రవేశ పరీక్షలో 88.75 మార్కులు సాధించి సీటు కైవసం చేసుకోవడం గర్వకారణమని సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమిష్టి సహకారంతో సొంత నిధులు వెచ్చించి ఈ పాఠశాలను పునఃప్రారంభించామని తెలిపారు. పాఠశాల నాణ్యతను గుర్తించి పక్క గ్రామమైన జయవరం నుండి 25 మంది విద్యార్థులు ఈ పాఠశాలకు రావడం వల్ల ప్రస్తుతం 40 మంది విద్యార్థులతో పాఠశాల విజయవంతంగా నడుస్తోందని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్, టై, బెల్ట్, ఐడి కార్డ్స్‌తో పాటు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, బీడీ, SC, BC స్కాలర్‌షిప్‌లు ఇప్పించడం జరుగుతుందని వివరించారు. ముఖ్యంగా దసరా సెలవుల్లో సైతం నవోదయ స్పెషల్ క్లాసులు నిర్వహించడం వల్ల హర్షవర్ధన్ ఈ ఘనత సాధించగలిగాడని తెలిపారు. ప్రతిభ చాటిన హర్షవర్ధన్‌తో పాటు అతడిని తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులు లింగంపల్లి రాజును, ఉపాధ్యాయురాలు వకుళ మేడంను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని, భవిష్యత్తులో ఈ పాఠశాల మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వం హామీలను తక్షణమే నెరవేర్చాలి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :**రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తమ హామీలను తక్షణమే నెరవేర్చాలనిబిజెపి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లోని రైతులకు రైతు భరోసా తక్షణమే ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన ఫించన్లు మంజూరు చేయాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గృహాలు నిర్మించుకున్న అబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. భూ భారతి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీఠ వేయాలన్నారు. ప్రజలకు అవసరమయ్యే కులం, ఆదాయం, నివాసం సర్టిఫికేట్లను సకాలంలో ఇచ్చేలా రెవెన్యూ అధికారుల తమ పనితీరును మార్చుకోవాలన్నారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ గ్రామంలో 10 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. బిజెపినాయకులు శ్రీనివాస్, తిరుపతి, అనూప్ రావు, గంగారాం, అశోక్, తుకారం, దివాకర్, ఆముద రాజు, రాజన్న, రాము, సాగర్, సత్యం ఉన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు నామమాత్రమే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి చేసిన కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం మొత్తం బడ్జెట్ వ్యయాన్ని 3,24,234 కోట్లుగా చూపినప్పటికీ, విద్యారంగానికి కేటాయించిన 26,674 కోట్లు మొత్తం బడ్జెట్‌లో కేవలం 8.23 శాతం మాత్రమేనని స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ వాటా కేవలం 0.65 శాతం మేర మాత్రమే పెరిగిందని, ఇది విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకునూరి మురలి నేతృత్వంలోని విద్యా కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ, బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం కూడా పాఠశాలల అభివృద్ధికి నిధులు దొరకటం లేదని కమిషన్ ఎత్తి చూపిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 15 శాతం నిధులను విద్యాశాఖకు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.





**విద్యకి 18 శాతం నిధులు ఎక్కడ?**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తంలో కేవలం 8.22 శాతం అవుతుందని ఫెడరేషన్ నాయకులు దోర్నాల భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ లో 18శాతం నిధులకు సిఫార్సులు చేయబడ్డాయి. నిధులను సమకూర్చలేని ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ లు అంటూ కమిషన్ ద్వారా సిఫారసు చేయించడం విడ్డూరం. విద్యారంగం బాగుపడాలంటే బడ్జెట్ ను కనీసం 20 శాతానికి పెంచి, ఉన్న స్కూల్ లనే బాగు చేయాలి.

## కస్తూర్బా విద్యార్థినులకు తీరిన నీటి కష్టాలు

**ప్రజాపక్షం /పెగడపల్లి :** పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎదురవుతున్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. మండల ప్రజా పరిషత్ నిధుల ద్వారా మంజూరైన కొత్త బోర్వెల్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, స్థానిక సర్పంచ్ ఓరగల అరుణ శ్రీనివాస్ గారితో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులకు తాగునీరు మరియు ఇతర అవసరాలకు నీటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ బోర్వెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని వారు పేర్కొన్నారు. బోర్వెల్ ఏర్పాటుతో నీటి సమస్య తీరడంపై పాఠశాల ఎస్.ఓ. బి.మీనాక్షి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చాట్ల విజయభాస్కర్, లింగంపల్లి మహేష్, నాయకులు ఐలేని వంశీధర్ రావు, పాఠశాల సిబ్బంది , విద్యార్థినులు పాల్గొన్నారు.

## పుస్తెల తాడు దొంగలించిన దొంగల అరెస్టు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మహిళ మెడలో నుండి పుస్తెల తాడు లాక్కెళ్ళిన దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. నిందుతుల వద్ద రెండు బంగారు పుస్తెలు(4.4 గ్రాములు),ద్విచక్ర వాహనం,రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయినగర్ లో మేర్గు లత తన ఇంటి వద్ద గేటు బయటకు రాగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఏదో అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ మెడలోగల బంగారు పుస్తెలు బలవంతంగా తెంపుకొని ద్విచక్ర వాహనంపై పారిపోయారని, మేర్గు లత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సిసి కెమెరాల ఆధారంగా నిందుతులను సయ్యద్ మౌలాన, మంగురు ప్రకాష్ యాదవ్ లుగా గుర్తించి సాంకేతికత ఆధారంగా నిందుతులు సిరిసిల్ల కు వస్తున్నారన్న సమాచారం మేరకు రడుగు చౌరస్తా వద్ద నిందుతులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు పంపించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు భాద్యతగా స్వీయరక్షణార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,గ్రామాలలో,పట్టణాలలో ఎవరు మానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 కి లేదా,పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.

## జిల్లా స్కేట్లింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కొత్తపల్లి:**స్కేటింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని, ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఆయన మాట్లాడారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక టోర్నమెంట్లు, చాంపియన్‌షిప్ పోటీలను చక్కటి సమన్వయంతో జయప్రదం చేసి క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించామన్నారు. ఈ సంధర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ స్కేటింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్రం నుంచి ఎ.కిషన్, జిల్లా యువజన క్రీడా విభాగం నుంచి పవన్, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి జనార్ధన్ రెడ్డి, రిటర్నింగ్ ఆఫీసర్‌గా మాజీ కార్పోరేటర్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి టి.రమేష్ రెడ్డి వ్యవహరించారని చెప్పారు. నూతనంగా అధ్యక్షునిగా డా.కెప్టెన్ బి.మధుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్, కోశాధికారిగా జగదీశ్వరాచారి, ఉపాధ్యక్షులుగా ఎం.అరవింద్, ఎస్.రాజయ్య, ఎ స్.అనుదీప్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఇంద్రదేవ్, వి.రమేష్, జె.నరేష్ తదితరులు ఎన్నుకోబడ్డారని తెలిపారు. ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి, ఎస్.కోదండరాములు ప్యాట్రన్స్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

## కాచిరెడ్డిపల్లిలో సిసి కెమెరాల ఏర్పాటు

**ప్రజాపక్షం/గంగాధర:**గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన తొమ్మిది సిసి కెమెరాలను శుక్రవారం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో సిసి కెమెరాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందన్నారు. ప్రజల భద్రతను కాపాడడంలో సిసి కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బచ్చు దయాకర్ సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ఉప సర్పంచ్, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు సమగ్ర శిక్షణ



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కొత్తపల్లి మండలం లోని రైతు వేదికలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన వరి రకాల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యత వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి రైతులకు నూతన వరి రకాల లక్షణాలు, అధిక దిగుబడి సాధించే విధానాలు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక గురించి వివరించారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా మట్టి ఆరోగ్యం మెరుగుపడడం, ఖర్చులు తగ్గడం , నాణ్యమైన ఉత్పత్తులు పొందడం గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. మధుకర్, డా.రజనీకాంత్, మండల వ్యవసాయ అధికారి కె.సంతోష్ కుమార్, డిసిఎస్ వాలంటీర్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హుస్నాబాద్:**విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని విమర్శించారు. తెలంగాణ బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో విద్య పట్ల వివక్ష కనిపిస్తుందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మోసం చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ ఉంటే ప్రభుత్వం కేవలం 4 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

## భూ సమస్యల పరిష్కారమే థానునాయక్‌కి నిజమైన నివాళి

### బీమా సాహెబ్,గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

**ప్రజాపక్షం/కరీంనగర్:**గిరిజనులు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు థాను నాయక్ కి అర్పించే నిజమైన నివాళి అని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమాసాహెబ్ అన్నారు. నేడు రాంనగర్ లో నిర్వహించిన థాను నాయక్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని చిత్రపటానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్ నాయక్ తో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి వెబ్సైట్ వల్ల గిరిజనులు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం భూభారతి వెబ్‌సైట్లో భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మార్వో స్థాయి వరకు పాస్వర్డ్ ఇవ్వాలని కోరారు.. అలాగే పహానీలో కాస్తు కాలాన్ని కూడా తిరిగి పునరుద్ధరించాలని అన్నారు.. రాష్ట్రంలో 12 లక్షల మంది సాదా బైనామాలు రెగ్యులర్ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తీసి వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు శివరాజ్, నగర అధ్యక్షులు ప్రకాష్ నాయక్, నాయకులు నాగరాజు, అనిల్, రాజ్ కుమార్, రమేష్, సురేష్,శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కష్ట ఫలితమే సకాలంలో బొగ్గు ఉత్పత్తి

### జీడికె 11వ ఇంక్లైన్ కార్మికులకు అభినందనలు* ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మికుల కష్ట ఫలితమే సకాలంలో అనుకున్న లక్ష్యాలతో బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జీడికె 11వ ఇంక్లైన్ లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించిన సందర్భంగా అర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ లు కార్మికుల కు అభినందనలు తెలిపారు. అనంతరం జీడీకే వన్ ఇంక్లైన్లో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గని ఎజెంట్ చిలుక శ్రీనివాస్, గని మేనేజర్ తో పాటు గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు గోడిశెల నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో శంకర్‌రావు పేట గ్రామస్థుల ఆందోళన




**ప్రజాపక్షం/జగిత్యాల :**జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట గొల్లపెల్లి మండలం శంకర్‌రావు పేట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 15 రోజుల క్రితం శంకర్‌రావు పేట గ్రామానికి చెందిన ప్రణీత్ అనే విద్యార్థిని జిల్లా కేంద్రానికి చెందిన ఓ పాఠశాల వాహనం ఢీ కొట్టింది. దీంతో ప్రణీత్‌కు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లిపోయాడు. 15 రోజులు గడుస్తున్నా పాఠశాల యాజమాన్యం స్పందించ కపోవడంతో శంకర్‌రావు పేట గ్రామస్థులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. చికిత్స కోసం ఇప్పటికే రూ.10 లక్షలు ఖర్చు అయ్యాయని విద్యార్థి కుటుంబ సభ్యులు రోదించడం పలువురి కలిచివేసింది. బాధిత కుటుంబానికి ఆసుపత్రి ఖర్చులు అందించి న్యాయం చేయాలని పాఠశాల యాజమాన్యాన్ని గ్రామస్థులు కోరుతున్నారు.

## విద్యుత్ సేవలో విప్లవాత్మక మార్పు

### జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు అత్యాధునిక సాంకేతికతతో పరిష్కారం దిశగా విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంతో పాటు క్షేత్రస్థాయి ఉద్యోగుల భద్రతను పటిష్టపరిచేందుకు విద్యుత్ విభాగం ఒక మైలురాయి చర్య ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ అని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ విద్యుత్ రంగంలో పనిచేసే సిబ్బంది భద్రతకు అత్యంత కీలకంగా మారిందని వారు అన్నారు.తప్పుడు ఫీడర్ ఎంపిక, పంపిణీ వ్యవస్థపై అస్పష్టత, సమాచార లోపం, మాన్యువల్ ప్రక్రియలో జాప్యం తదితర కారణాల వల్ల పలు సందర్భాలలో విద్యుత్ ఉద్యోగులు తీవ్రమైన ప్రమాదాలకు గురవుతున్నారని వీటన్నింటికీ పరిష్కార మార్గం ఎల్సీ యాప్ ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా లైన్ క్లియర్ అనుమతులు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జారీ అవుతాయి. సిబ్బంది పని చేయవలసిన ఫీడర్, పంపిణీ లైన్ వివరాలు యాప్‌లో స్పష్టంగా ప్రదర్శితమవుతాయి. తప్పుడు ఫీడర్ ఎంపికకు అవకాశం లేకుండా వ్యవస్థ అప్రమత్తం చేస్తుందని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది మధ్య రియల్ టైమ్ సమాచార మార్పిడి సాధ్యమవుతుంది. ప్రతి ఎల్సీ జారీ, వినియోగం, రద్దు వివరాలు డిజిటల్‌గా నమోదు అవుతాయని పారదర్శకత పెరుగుతుందన్నారు. విద్యుత్ భద్రతకు పెద్దపీట వేశామని ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రతి ఒక్కరు ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ వాడాలని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కోరుతున్నామని చెప్పారు. ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ ఉపయోగించడం వలన సంస్థ తరుపున నుండి సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కాపాడకుంటున్నామని కేవలం ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ ద్వారానే సాధ్యమైందని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అన్నారు. ఇదంతా గౌరవ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి తీసుకున్న చర్యల వలన జవాబుదారీతనం పెరిగిందని, అంతరాయాలు తగ్గినాయని, సమర్థవంతమైన పర్యవేక్షణ కనపడుతుందని సిబ్బంది పని ప్రదేశాలలో సులభంగా సౌకర్యవంతంగా పని చేసుకుంటున్నారని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం పేర్కొన్నారు.

## జాతీయస్థాయి సంగీత పోటీలో పారమిత హెరిటేజ్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**భారతదేశపు ప్రముఖ వర్చువల్ ఈవెంట్ సంస్థ గ్లిట్జ్ అండ్ గ్లోరీ పూణే ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సంగీత పోటీలలో స్థానిక నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పథకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు. స్టార్స్ ఆఫ్ ఇండియా అవార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీ దేశవ్యాప్తంగా ఉన్న నిజమైన ప్రతిభను గుర్తించే ఒక అత్యంత ప్రతిష్టాత్మక వేదిక అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారులతో తలపడి పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ వాయిద్య సంగీత విభాగంలో మొదటిస్థానం సాధించగా, 9వ తరగతికి చెందిన ఎస్. శ్రీసాన్విక గాత్ర సంగీత విభాగంలో రెండవ స్థానం సాధించారు. జాతీయస్థాయిలో అవార్డులు పొందిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వియయం ప్రసాద్, వినోద్‌రావులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్రపాత్రో, భవానీ, నిఖిత,సంగీతఉపాధ్యాయులుజితుమణి శర్మ, కిరణ్‌లు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కార్మికులు, కౌలు రైతుల నోట్లో మట్టికొట్టిన బడ్జెట్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**రాష్ట్ర అసెంబ్లీలో 202627 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3.24,234 కోట్ల రూపాయల వార్షిక బడ్జెట్‌లో ఉపాధి కార్మికులకు ఒక్క రూపాయి సైతం కేటాయించలేదని ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ సుంకరి సంపత్ విమర్శించారు. ఏ విధంగా గ్రామీణ ప్రాంతాల కార్మికులకు ఉపాధి గ్యారంటీ ఇస్తారని ప్రశ్నించారు? కేంద్ర ప్రభుత్వం 90 శాతం నుంచి 60 శాతం కుదిస్తే రాష్ట్రంలో ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి సైతం కేటాయించలేదన్నారు. కౌలు రైతులకు ఈ బడ్జెట్‌లో స్థానమే లేదన్నారు. 4 వేల పెన్షన్, తులం బంగారం నిధులే కేటాయించలేదన్నారు. నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు. అంకెల గారడీతో గత బడ్జెట్‌లో చూపించిన పద్దులు రూ.58 వేల కోట్లు ఖర్చు చేయకుండా లోటు బడ్జెట్ చూపించారన్నారు. ఈ బడ్జెట్‌లో లక్ష కోట్ల అప్పులు మొత్తంగా 8 లక్షల కోట్ల అప్పులు చూపించారన్నారు.

## బిసిల సంక్షేమానికి నిధుల కేటాయింపులో వివక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ తెలంగాణ ప్రజలను, మహిళలను పూర్తిగా నిరాశపరిచిందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ బడ్జెట్‌లో అసలు ఆరు గ్యారంటీల ఊసేలేదన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీ మాత్రమేనని పేర్కొన్నారు. బిసి డిక్లరేషన్‌లో బిసిల సంక్షేమానికి ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ప్రస్తుతం కేవలం 12 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టి బిసిలను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచనకు గురిచేసిందన్నారు. వృద్ధులకు నాలుగు వేల పింఛన్ ఇవ్వకుండా ముంచిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి నిధుల మంజూరులోనూ వివక్ష చూపారన్నారు.

## పంటలపై రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలం వల్బాపూర్ రైతు వేదికలో శుక్రవారం రైతులకు పంటలపై ఆత్మ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు పద్ధతులు, జింక్ లోప నివారణకు పద్ధతులు, పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై వివరించారు. నానో యూరియా, నానో డిఏపి వాడే విధానంపై ఇఫ్కో కంపెనీ మేనేజర్ బాలాజీ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గణేష్, సర్పంచ్ అందె శ్రీమతి, ఉపసర్పంచ్‌ల ఫోరంల అధ్యక్షుడు నామని విజేందర్, మార్కెట్ డైరెక్టర్ శ్రీపతి రెడ్డి, విస్తరణాధికారి సంగీతతో పాటు వల్బాపూర్, బేతిగల్, కనపర్తి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## దారి మైసమ్మ తల్లికి మొక్కులు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ సర్పంచ్ నక్క రాజేశ్వరిరాజయ్య ఆధ్వర్యంలో దారి మైసమ్మ తల్లికి పాలకవర్గంతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని,పాడిపంటలు బాగా పండాలని దారి మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు.అలాగేదారిప్రయాణ రక్షణ, గ్రామానికి వెళ్లే రోడ్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండాలని మేకను బలి ఇచ్చి పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారుకూరి సతీష్, మాజీ ఎంపిటిసి బండారి సుధాకర్,వార్డు సభ్యులు తోపాటు గ్రామస్తులు ఉన్నారు.

## కాంగ్రెస్ బాడీలో పదవి పొందిన వారికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా మళ్లీ ఎన్నికైన చొప్పరి సదానందంకి,కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా అంబటి చంద్రమౌళి ని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా తాళ్లపల్లి కుమార్ ను నియమించినందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకి,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ కి, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. పదవులను అలంకరించిన నాయకులకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## డిసిసి సభ్యుడిగా పరమేశ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** టిపిసిసి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూత్రపు పరమేశ్ ను నియామకమయ్యారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేసిన జిల్లా కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చోటు దక్కింది. పరమేశ్ నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, జిల్లా అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ లకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విప్ విజయ రమణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పరమేష్ తెలిపారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజేశ్వర్ రావు ఎన్నిక

**ప్రజాపక్షం/ముత్తారం:**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఎన్నికలు శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ఆలయ ప్రాంగణంలో నిర్వహించగా చైర్మన్ గా తీగల రాజేశ్వర్ రావు,వైస్ చైర్మన్ గా కట్టెకోళ్ళ మల్లయ్య ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కాగా నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లను గ్రామ సర్పంచ్ కవితకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు.ఎన్నికలలో గ్రామ సర్పంచ్ కవితకిషన్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సిరికొండ వేణుగోపాల్ రావు,నరెడ్ల సదానందం,షేర్ స్వామి,దాసరి దామోదర్ గౌడ్,దాసర రవి గౌడ్,పురోహితులు నవీన్ శర్మ,మీసుగు మల్లయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయంలో ఉగాది వేడుకలు



**ప్రజాపక్షం/రామగిరి:** పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని జీ.ఎం. కార్యాలయ ఆవరణలో గురువారం ఉగాది వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకలకు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత సంవత్సర తీపి, చేదు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి కుటుంబంలో సుఖ సంతోషాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు.అంతే కాకుండా గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో అధిగమించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు.వేడుకల్లో భాగంగా ఉగాది పచ్చడిని జీ.ఎం.కార్యాలయ ఉద్యోగులందరికీ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి బి.టి.మురళీ కృష్ణ, ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటూజీఎం బండి సత్య నారాయణ, విభాగాధిపతులు బి.వి.సత్య నారాయణ, రాజేంద్ర కుమార్, జనార్ధనరెడ్డి, రాజారెడ్డి, సునీల్ ప్రసాద్, శ్యామల, లతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు,కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కొత్త రోడ్డు రక్షణపై కాంగ్రెస్ నాయకుల ఆందోళన

**ప్రజాపక్షం/రామగిరి :** కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రెండ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలోరామగిరి మండలం, కల్వచర్ల గ్రామంలో ఇటీవల నిర్మించిన 18 ఫీట్ల వెడల్పు రోడ్డు రక్షణపై గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇట్టి విషయంపై రామగిరి మండల ఎంపిడిఓ, కల్వచర్ల గ్రామ సెక్రటరీ కి వినతి పత్రం అందజేశారు అనంతరం మాట్లాడుతూ గ్రామ ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సుమారు రూ. 2.6 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం చేపట్టబడింది.ప్రస్తుతం అదే రోడ్డు పక్కన వాటర్ పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ తవ్వకాల వల్ల కొత్తగా నిర్మించిన రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు కుంగిపోవడం లేదా కూలిపోవడం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశముందని వారు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, పైప్‌లైన్ పనులను రోడ్డు నుండి కొంత దూరంగా మార్చి వేయాలని, అలాగే ఇప్పటికే తవ్విన ప్రాంతాలను సిమెంట్ కంకరతో బలంగా పూడ్చి రోడ్డును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.లేనిచో ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రెండ్ల కృష్ణమూర్తి, గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒర్రె సదయ్య,వీరబోయిన రాజమౌళి,కోలిపాక సత్తయ్య,బూడిద రాజేందర్,గొట్టిముక్కల మల్లేష్ గౌడ్, ఆసం రాజు,జంగిలి సదానందం,మేకల మారుతి,మామిడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## హద్దులు చూపించాలని తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/రాయికల్ :** నిధులు ఉన్నాయి.. హద్దులు చూపండంటూ మైతాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శుక్రవారం రాయికల్ తహసీల్దార్ నాగార్జున కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నిధులుమంజూరై ఉన్నప్పటికీ భూమి సరిహద్దుల వివాదంతో రోడ్డు పనులు నిలిచిపోవడంతో మైతాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించి పనులు పూర్తిచేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.మైతాపూర్ గ్రామంలోని శ్రీ గిరిగుట్ట (గన్నేగుట్ట)పై సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయానికి మెయిన్ రోడ్డునుంచి సిమెంట్ రహదారి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు దామోదరరావు తన నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ నిధులతో రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ,మధ్యలో భూమి పట్టాదారులు అడ్డుపడటంతో పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు.భూమి సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో వివాదం నెలకొన్నదని,రెవెన్యూ శాఖ అధికారులు,సర్వే అధికారులు గ్రామానికి వచ్చి సరిహద్దులు నిర్ణయిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.లేనిపక్షంలో మంజూరైన నిధులు వినియోగం కాకుండా తిరిగి వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గిరిగుట్టపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి పరిసర గ్రామాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భక్తుల రాకపోకలకు అనుకూలంగా వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో భూమి సరిహద్దుల సమస్యను తక్షణమే పరిష్కరించి రహదారి పనులు పూర్తి చేయాలని వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్,అనుమల్ల రమ,బూస గంగామల్లయ్య,భూపల్లి పరమేష్, స్థానిక నాయకులు సత్యనారాయణ కలిసి తహసీల్దార్‌ను కోరారు.

## 22 నుండి వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో నూతనంగా ఎన్నుకోబడిన వార్డు సభ్యులకు రెండు విడతల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మొదటి విడత భాగంగా ఈనెల 22 నుండి 26 వరకు ఐతుపల్లి, ఆరవెల్లి, బతికపల్లి, దేవికొండ, దోమలకుంట, ఏడుమోటలపల్లి, కీచులాటపల్లి, లింగాపూర్, ల్యాగలమర్రి, మద్దులపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల వార్డు సభ్యులకు, రెండవ విడతలో వచ్చే నెల 06 నుండి 10 వరకు నామాపూర్, నంచర్ల, నందగిరి, నరసింహుని పేట, పెగడపల్లి, రాజారాంపల్లి, రాంబద్రుని పల్లి, రాములపల్లి, శాలపల్లి, సుద్దపల్లి, వెంగలాయిపేట, ఎల్లాపూర్ గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. గ్రామ పాలనపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమానికి ఆయా గ్రామాల వార్డు సభ్యులందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఎంపిడిఓ కోరారు.

## పేదింటి బిడ్డ పెళ్లికి సర్పంచ్ పదివేలు అందజేత

**ప్రజాపక్షం/ముత్తారం :** సర్పంచ్ ఎన్నికలలో తను గెలిచినట్లయితే ప్రతి పేద ఆడబిడ్డ పెళ్లికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సర్పంచ్ ఎన్నికలలో గెలిచాక ప్రతి పేద బిడ్డ పెళ్లికి పదివేల రూపాయలు అందిస్తూ అండగా నిలుస్తున్న ఓడేడు గ్రామ సర్పంచ్ కవితకిషన్ రెడ్డి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లోని ఓడేడ్ గ్రామ సర్పంచ్ ఎన్నికల సమయంలో నిరుపేద కుటుంబానికి చెందిన ప్రతి పేదింటి ఆడ బిడ్డల వివాహాలకు 10.000 వేల రూపాయలు అందజేస్తానని గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఓడేడు గ్రామానికి చెందిన మారెపల్లి రాధ సారయ్య ల కూతురు అంజలి వివాహానంతరం హాజరై 10.000 కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్,వార్డు సభ్యులు నరెడ్ల రమేష్,రత్న రవీందర్,పూదరి స్వప్న మహేందర్,రత్న రాజేశ్వరి,కట్కూరి రాజిరెడ్డి,తీగల రాజేశ్వర్ రావు,దాసరి రవీందర్,షేర్ స్వామి,ముస్కె సదానందం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే పాలకవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కరించేందుకే పాలకవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో పాలకవర్గం తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని రెండో వార్డులో వాటర్ సమస్య తీర్చాలని వార్డు సభ్యురాలు లక్కం లక్ష్మి ప్రభాకర్ కోరారు.స్పందించిన సర్పంచ్ రెండో వార్డులో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి అన్నారు.అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నపూర్ణ ఉపేందర్ అన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి,వార్డు సభ్యులు మద్దెల దివాకర్,అంజి,సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:**శుక్రవారం రోజున పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సన్ ఫైన్ స్కూల్ పెగడపల్లి కరస్పాండెంట్ సయ్యద్ నజీర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నా సెల్ మాట్లాడుతూ పెద్దపల్లి లైన్స్ క్లబ్ వారిచేజిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేద, నిరుపేద రోగులు మరియు వారి సహాయకులకు ఆహారం అందించడం ద్వారా వారి కష్టసమయంలో కొంత ఉపశమనం మరియు ఆసుపత్రుల వద్ద ఆహారం కోసం ఇబ్బందులు పడే పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.

## ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రపంచ పిచ్చుకల దినోత్సవం మరియు ప్రపంచ అడవి దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లిపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శాంబయ్య హాజరై, పక్షుల సంరక్షణ మరియు అడవుల పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు.పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్ విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు గూళ్లు తయారు చేయడం, మొక్కలు నాటడం,అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రమాదేవి, ఫారెస్ట్ సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రీనివాస్,రవికుమార్,వసంతరావు, లక్ష్మి, రాజశేఖర్, మహేష్, ఆనంద్, రాజన్న, రతిలాల్, బాలమురళి రజిత, మల్లారెడ్డి, శంకరయ్య, కృష్ణ ప్రసాద్, జీవన్ రెడ్డి లు మరియు విద్యార్థులు,పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించిన :ఎఎస్‌పి



ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలో అక్రమంగా ఉన్న ఇసుక నిల్వలను ఏ.ఎస్పీ సాయికుమార్ బైంసా టౌన్ సీఐ సాయికుమార్, పరిశీలించారు.అక్కడ నిల్వ చేసిన ఇసుకపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు.పరిశీలన అనతరం,అక్రమంగా ఉన్న ఇసుక నిల్వలపై సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అం దించి,కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగింది. అక్రమ ఇసుక రవాణా నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా ఇ లాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.

## చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నేరడిగొండ:నేరడిగొండ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో గిరిజన సురక్ష మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వచ్చేనేల చలో ఢిల్లీ పోస్టర్లను లఖంపూర్ సర్మేడి ఆత్రం గంగారాం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు,అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాల గిరిజనులు ఆదివాసీ యువత మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆత్రం సోనేరావు సర్పంచ్లు సెడ్మాకి గంగాధర్,తోడషం శంకర్,ఆత్రం నగేష్, గంగారాం,గోడం అమృత్‌త రావ్,కనక అమృత్,మండాడి భీంరావ్,ఆయా గ్రామాల పటేల్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలకు చెందిన గెడం సాయికుమార్ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ 2026 పరీక్షలో అర్హత సాధించి కళాశాలకు పేరు తెచ్చారని ప్రిన్సినల్ డాక్టర్ ఎం. శివకృష్ణ తెలిపారు. రసాయన శాస్త్ర విభాగానికి చెందిన సాయికుమార్ ఈ పరీక్షలో ఆల్ ఇండియా 5611 ర్యాంకు సాధించారు. కెమిస్ట్రీ పేపర్‌లో ఎస్టీ కేటగిరీలో ఆయన అర్హత మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించి, అతని కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షంచారు. గిరిజన విద్యాసంస్థల్లోని విద్యార్థుల ప్రతిభకు, విద్యా ప్రమాణాలకు ఇటువంటి విజయాలే నిదర్శనమని అధ్యాపకులు కొనియాడారు.

# రంజాన్ పండుగకు పటిష్ఠ బందోబస్తు..

### ఎస్‌పి జిజానకి షర్మిల

ప్రజాపక్షం/బైంసా : రంజాన్ పండుగ సందర్భంగా, బైంసా పట్టణంలోని గడ్డన్న వాగు వద్ద ఉన్న ఈద్గా దగ్గర ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల,పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.రంజాన్ పండగ సందర్భంగా పెద్ద ఎత్తున ముస్లిం సహోదరులు ప్రార్థనలు చేసుకోవడానికి ఈద్గాను సందర్శిస్తారు,కావున దీన్ని దృష్టిలో ఉంచుకొని,ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ సదుపాయాలు ,ప్రజల రాకపోకల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రజలు



కూడా పోలీసులకు సహకరించి పండుగను శాంతియుత వాతావరణంలో జరపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల,ఐపీఎస్ తో పాటు, ఏఎస్పీ సాయి కిరణ్,ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ. లు,ఎస్.ఐలు,ఆర్.ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలలో సత్తా చాటిన సృజన స్కూల్..

ప్రజాపక్షం/కుంటాల : నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గల సృజనా విద్యానిలయం పాఠశాల విద్యార్థులు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలలో ప్రభంజనం సృష్టించారు.సృజన పాఠశాల విద్యార్థులు 37 మంది జవహర్ నవోదయ ప్రవేశానికి ఎంపికయ్యారు.కాగజ్‌నగర్ కు 23 మంది నిజాంసాగర్ కు 13 మంది వరంగల్,జగిత్యాల జిల్లాల్లో గల జవహర్ నవోదయ పాఠశాలలకు ఒక్కొక్కరు చొప్పున ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కొత్త కావు గంగన్న తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా ఒడ్నం సహర్ష్,నిజామాబాద్ జిల్లా టాపర్‌గా లెక్షనలు నిలువగా ఇదే పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు కావడం విశేషం.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జవహర్ నవోదయ పరీక్షలలో అత్యధిక సీట్లు సాధించిన సృజన విద్యా నిలయం ప్రిన్సిపాల్ కె.గంగన్న ను జిల్లా వాసులు పోషకులు





అభినందించారు.కాగ కుంటాల మండలంలోని కల్లూరు ఎస్ఎంఎస్ పాఠశాలకు 17 సీట్లు కుంటాల శాంతినికేతన్ పాఠశాలకు 11 జవహర్ నవోదయ సీట్లు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ల్లు గజానంద్,ధోనిగామ సంతోష్ లు తెలిపారు.

# అకాల వర్షం..అన్నదాతకు తీరని శోకం..

### మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న..!

ప్రజాపక్షం/సోన్: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు సోన్ మండలంలోని రైతులకు కోలుకోలేని దెబ్బ తీశాయి,ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు కురిసిన అకాల వర్షం,గాలుల బీభత్సానికి చేతికి రావాల్సిన మొక్కజొన్న పంట పూర్తిగా నెలకొరిగింది.మండలంలోని లోకల్ వెల్మల్,పాక్‌పట్ల గ్రామంలో అత్యధికంగా నష్టం వాటిల్లగా,సిద్దులకుంట,జాప్లాపూర్,కౌట్ల,మూజ్గి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో పంట నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కన్నీరు పెట్టిస్తున్న కష్టం..

రుతుపవనాల రాక ముందే విరుచుకుపడిన ఈ వర్షం,అన్నదాతల ఆశలపై నీళ్లు చెల్లింది.వేలాది రూపాయలు అప్పులు తెచ్చి,ఎంతో కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంట ఇప్పుడు నేలపాలై ఫాలో అవ్వడం చూసి రైతులు కన్నీటి పర్యంతమతున్నారు.కళ్లముందే పంట నాశనమవుతుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని,పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో కూరకు



పోయే ప్రమాదం ఉందని లోకల్ వెల్మల్ గ్రామ రైతులు వాపోతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్..

ఆకాల వర్షం తెచ్చిన ఈ వపత్తు నుండి తమను గట్టెక్కించాలని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి,నష్టపోయిన పంటలను సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఎకరాకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి,తమకు తగిన పరిహారం అందించి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సోన్ మండల రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది.

# గుంతలమయంగా ఝురి, బరంపూర్ రహదారి

ప్రజాపక్షం/ తలమడుగుః తలమడుగు మండలంలోని ఝురి గ్రామం నుండి బరంపూర్ వెళ్లే రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో ఝురి, పున్నగూడ, చెర్లపల్లి, టొక్కిగూడ గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ గుంతలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, ఆర్లి(కె), రత్నపూర్ గ్రామాలకు గతంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించినప్పటికీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంపై స్థానికులు ఆగ్రహం



వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గుంతల్లో నీరు చేరి రోడ్డు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంటుందని, చిన్నపాటి వర్షానికే ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై గతంలో అనేక సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పెద్ద ప్రమాదాలు జరగకముందే యుద్ధ ప్రాతిపదికన నూతన రహదారులను నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో ఇలేగాం గ్రామాభివృద్ధి

ప్రజాపక్షం/బైంసా: ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సహకారంతో ఇలేగాం గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం బైంసా మండలంలోని ఇలేగాం గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు.ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.హాజరైన ఎంపీడీవో ప్రదీప్,ఏపీఎం రమేష్ లను ఇతర అధికారులను శాలువాతో సత్కరించారు. శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి సుభాష్,గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రత్నాకర్,వైస్ చైర్మన్ దేవిదాస్ పటేల్,వార్డు సభ్యులు మధుకర్,సుదర్శన్,సవిత,పంచాయతీ కార్యదర్శి సురేష్,నాయకులు,గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నిర్మల్ కొండాపూర్ పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని కొండాపూర్ ఉన్నత పఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద నాయక్ డిమాండ్ చేశారు.శుక్రవారం నిజ నిర్ధారణ కమిటో ఆధ్వర్యంలో నాయకులు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు.పాఠశాలలో కేవలం ఆర్థిక లావాదేవీల అంశంపైనే కాకుండా,బాలికలపై అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు భాస్కర్ పై తక్షణమే పోక్సో కేసు నమోదు చేయాలని కోరారు.సదరు ఉపాద్యాయుడిపై గతంలో ఆయన పని చేసిన ముజ్గిగి,లక్ష్మ ణచాంద వంటి పాఠశాలల్లో కూడా ఇలాంటి ఆరోపణలే వచ్చాయని ఆయన గుర్తు చేశారు.విద్యార్థినుల భద్రత దృష్ట్యా జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్,ఆదివాసి నాయకుడు సీడం సంబు పాల్గొన్నారు.

## నూతనంగా ఎంపికైనా డిసిసి కమిటీ సభ్యులకు సన్మానసభ

ప్రజాపక్షం/బైంసా :ముధోల్ నియోజకవర్గం నుండి ఎన్నికైన డిసిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు బైంసా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావు పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది.ఈ సందర్భంగా నూతనంగా నిర్మల్ జిల్లా డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటికి ఎన్నికైన సభ్యులను మాజీ ఎమ్మెల్యే బోస్లె నారాయణ రావు పాటిల్ శాలువాతో సత్కరించి అభినందించారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించినందుకు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నారయణరావు పటేల్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పిచ్చుకలు అంతరించిపోతున్న నేపథ్యంలో వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ రేడియేషన్, రసాయన ఎరువులు, చెట్ల నరికివేత వల్ల పిచ్చుకల సంఖ్య తగ్గుతున్నదని తెలిపారు. అనంతరం అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తులసి వేణుగోపాల్ విద్యార్థులతో కలిసి ఖాళీ వాటర్ బాటిల్స్‌తో హ్యాంగింగ్ ఫీడర్స్ తయారు చేసి పక్షులకు నీరు ఎలా అందించాలో విద్యార్థులతో కలిసి తయారు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, మంజునాథ్, వేదశ్రీ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యార్థికి ఘన సన్మానం

ప్రజాపక్షం /మల్లాపూర్ : ఇటీవలే విడుదలైన నవోదయ పరీక్షల ఫలితాల్లో సీటు సాధించిన భూక్య సహస్ర ను టిపిసిసి నాయకులు జువ్వడి కృష్ణారావు ఘనంగా శుక్రవారం సన్మానించారు. మండల కేంద్రంలోని వికాస్ ప్రైవేట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న సిర్పూర్ గ్రామానికి చెందిన భూక్య సహస్ర ఆరవ తరగతి ప్రవేశానికి నవోదయలో సీటు పొందడం అభినందనీయమని కృష్ణారావు అన్నారు. భవిష్యత్తులో చదువుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. నాయకులు జలపతి రెడ్డి నరసయ్య ,శ్రీనివాస్ రెడ్డి,వెంకటేష్ నర్సారెడ్డి మల్లయ్య,ఆనంద్ గౌడ్ ప్రకాష్ గౌడ్ రామ లక్ష్మ ణ్, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

ప్రజాపక్షం / జన్నారం : మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం డిక్షనరీలను పంపిణీ చేశారు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన సీదార్ల రామ్మోహన్, తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సీదార్ల ఉదయ్ కుమార్ లు తమ సొంత ఖర్చులతో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే డిక్షనరీలను పంపిణీ చేసిన రామ్మోహన్, ఉదయ్ కుమార్ లను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, శెట్టి రాజశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, నాగలక్ష్మి, గీత, స్వరూప, వెన్నెల, అంగన్వాడి టీచర్లు స్వరూప, వనిత పాల్గొన్నారు.

### వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం

ప్రజాపక్షం / సిర్పూర్ టి: సిర్పూర్ టి మండలంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రారంభమవుతుందని, మొత్తం ఐదు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. శిక్షకులు వార్డు సభ్యులకు గ్రామ పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, వారి బాధ్యతలు, విధులకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పిస్తారని తెలిపారు. సంబంధిత గ్రామ పంచాయతీ వార్డు సభ్యులందరూ నిర్ణీత సమయానికి హాజరై ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణ కోరారు.

## గిరిజనుల ఆర్థికాభివృద్ధికి మేకల పంపిణీ



ప్రజాపక్షం / తిర్యాని: గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రొంపల్లి సర్పంచ్ సీడం కృష్ణారావు సూచించారు. తిర్యాని మండలంలోని రొంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపు గూడలో శుక్రవారం టిజిఐఎల్పి కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఆర్పి సహకారంతో గిరిజనులకు మేకల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 14 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి నాలుగు మేకల చొప్పున మొత్తం 56 మేకలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మేకల పెంపకం ద్వారా కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని, పశుసంపద పెంపుతో ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అనిల్, మండల కోఆర్డినేటర్ లావణ్య, ఉపసర్పంచ్ పెందూర్ వనిత, వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ యువతి హత్య కేసు నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం / పెంచికల్ పేట్ : పెంచికలపేట్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్ పిలుపునిచ్చారు. కొండపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్క హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది. శుక్రవారం మొర్లిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లేడ గ్రామంలో కోయ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. శనివారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో బాధిత కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ న్యాయ సాధన కోసం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు తలండి మధుకర్ తెలిపారు. నిందితుడు కేర్సరి జలపతికి సహకరించిన కుటుంబ సభ్యులను తక్షణం అరెస్ట్ చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి నిందితుడికి కఠిన శిక్ష విధించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి మంజూరు చేయాలని కోరారు. ఆదివాసీ మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సమ్మక్క కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీలు, దళిత బహుజన సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నారు. జిల్లేడలోని కొమురం భీం విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గురిదాస్, తలండి ఎర్రయ్య, సుబ్బారావు, నాగయ్య, శ్రీకాంత్, బాపు, ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకుడు కోట ఆనంద్ పాల్గొన్నారు.

## హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలి




ప్రజాపక్షం / కాగజ్ నగర్ : విద్యార్థినులు తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకుని వేధింపుల నుంచి రక్షణ పొందేలా ధైర్యంగా ముందుకు సాగాలని కాగజ్ నగర్ షీ టీమ్ ఇన్‌చార్జి ఎఎస్ఐ సునీత అన్నారు. జిల్లా ఎస్పి నితిక పంత్, ఎఎస్పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఆపద సమయంలో డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి సమస్యలు ఎదురైతే వెంటనే షీ టీమ్ నంబర్ 8712670565కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు బి. రమాదేవి, శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి



ప్రజాపక్షం / కౌటాల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధోని శ్రీశైలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, ఎకరానికి ఏడాదికి 15,000 రూపాయల చొప్పున ఉన్న పాత బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రూ. 2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరిస్తుందని నమ్మించి, ఇప్పుడు అమలు చేయకపోవడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరు గ్రామాల్లో కట్న నిషేధం అమలు

ప్రజాపక్షం / వాంకిడి : వివాహ వేడుకల్లో కట్నం కానుకలను పూర్తిగా నిషేధిస్తూ వాంకిడి మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సంచలన తీర్మానం చేశారు. సర్పంచ్ పంద్రం సురేష్ ఆధ్వర్యంలో సోనాపూర్ పంచాయతీ పరిధిలోని గణేష్‌పూర్, చిచ్చుపల్లి, రోహిణిగూడ, పూనగూడ, పిట్టగూడ, దొడ్డిగూడ గ్రామస్తులు సమావేశమై ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వివాహ సమయంలో కట్నం తీసుకోవడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను అరికట్టేందుకు ఇకపై పెళ్లిళ్లలో కట్న కానుకలు తీసుకోవద్దని, వధూవరులకు కేవలం స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలు మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. ఈ నిబంధనను ఎవరైనా ఉల్లంఘిస్తే 5,000 రూపాయల జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో సామాజిక మార్పుకు దారితీసే ఈ ముందడుగును పలువురు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్టీసిని బలోపేతం చేయాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : విద్యుత్ బస్సులను ఆర్టీసీకే ఇచ్చి సంస్థను బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు సంకె రవి అధ్యక్షతన శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరి మార్చి 24న డిపోల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులు పనిచేసే చోట రైట్ టు సిట్ పై అవగాహన కల్పిస్తామన్నారు.ఈ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. వెంకటస్వామి, జి. ప్రకాష్, సిహెచ్ దేవదాస్, స్వాతి పాల్గొన్నారు.

## ఒలింపియాడ్స్‌లో స్లేట్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/ జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ (గ్రూప్ ఆఫ్ స్కూల్స్) విద్యార్థులు రాష్ట్ర స్థాయి గణిత, విజ్ఞాన శాస్త్ర ఒలింపియాడ్స్‌లో అద్భుత విజయాలు సాధించారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఆర్ఎంఓ, సివిఆర్ఎస్ఓ 202526 పోటీలలో ప్రతిభ కనబరిచారు. స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ధీరావత్ సాయి ఆదిత్య సైన్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించారు. 2వ తరగతి విద్యార్థి ఇషాన్ గణితంలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్, 5వ తరగతి విద్యార్థిని లావణ్య సహస్ర గణితంలో నాలుగో ర్యాంక్ పొందారు. అదేవిధంగా స్లేట్ హై స్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థి కె. శ్రీలౌకిక్ గణితంలో నాలుగో ర్యాంక్, 3వ తరగతి విద్యార్థిని జె. దిక్షాశ్రీ ఐదో ర్యాంక్ సాధించారు. విజ్ఞాన శాస్త్ర ఒలింపియాడ్‌లో హర్షిత్, శణ్ముఖప్రియ రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలోనూ పలువురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు కన్సోలేషన్ గ్రేడ్లు సాధించి పాఠశాల పేరు నిలబెట్టారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. విజేతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలి

### డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్

ప్రజాపక్షం/జన్నారం : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అమలవుతున్న టిబి, ఎన్‌సిడి, కుష్ఠు, మలేరియా వంటి వ్యాధుల నివారణ, చికిత్స చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ స్థాయిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి చిరుధాన్యాలు అవసరం

ప్రజాపక్షం/రెబ్బన : నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజల ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో అవసరమని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పేర్కొన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస్ పంతులు ఖుషీ మిల్లెట్, సిసి కెమెరాల దుకాణాన్ని మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఒకే చోట ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన సేవలను అందుబాటులోకి తెచ్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, వైస్ చైర్మన్ గాజుల రవీందర్, డైరెక్టర్ మారుతి పటేల్, మాజీ జెడ్పీటీసీలు పల్లె ప్రకాష్ రావు, దుర్గం సోమయ్య, సీనియర్ నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, చిరంజీవి గౌడ్, ఎండి నిజాం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, సురేష్ జైస్వాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదముస్లిం కుటుంబాలకు తోఫా కిట్ల పంపిణీ

ప్రజాపక్షం /పెగడపల్లి : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందజేస్తున్న ఈద్ కా తోఫా (రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు) పంపిణీ కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా తహశీల్దార్ ఆనంద్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్ పాల్గొని 232 ముస్లిం కుటుంబాలకు కిట్లను అందజేశారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పండుగ వేళ పేద కుటుంబాల్లో ఆనందం నింపేందుకే ఈ కానుకలను అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కుమార్, కుంటాల విష్ణు, మందపెల్లి అంజయ్య,నీరటి రాజేందర్, దప్పు నర్సయ్య, ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## అంకెల గారడీ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీతో పేద ప్రజలను, మహిళలను, నిరుద్యోగులను పూర్తిగా వంచించిన బడ్జెట్‌గా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైంది. అయినా కూడా మళ్లీ అదేవిధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లైనా ఇంకా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై, 420 హామీల అమలులో బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత లేదని విమర్శించారు. ప్రజలకు పనికొచ్చే స్కీంలకు కేటాయింపులు లేవు కానీ స్కామ్‌లు చేసే ప్రాజెక్టులకు కేటాయింపులు చేశారు. కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ.2500 చేయూత పథకం ప్రస్తావనే లేదు.

వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పెన్షన్‌ను రూ.2 వేల నుండి 4 వేలకు పెంపు కేటాయింపులు లేవని, తులం బంగారం హామీపూర్తిగా మరిచిపోయారని, జాబ్ క్యాలండర్ పూర్తిగా విస్మరించబడిందన్నారు. పూర్తి కానలేని రుణమాఫీపై స్పష్టత లేదని, 'రైతు భరోసా' పేరుతో హామీలిచ్చినా, ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని, ఆచరణకు సాధ్యం కానీ రాజీవ్ యువ వికాసానికి మాత్రం బడ్జెట్‌లో ప్రతిసారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో ఈ బడ్జెట్ వాస్తవికతకు దూరంగా ఉందని , ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ, ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలను పూర్తిగా వంచించే బడ్జెట్‌గా నిలిచిందని, ఈ బడ్జెట్ పూర్తిగా డొల్ల బడ్జెట్, గోల్‌మాల్ బడ్జెట్ అన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు అనేక హామీలతో ఆశలు కల్పించి బడ్జెట్‌లో కేటాయింపులు చేయక పేద ప్రజలను నట్టేట ముంచారని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

## ముస్లిం సమాజానికి రంజాన్ శుభాకాంక్షలు

## ఎమ్మెల్యే వేముల

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రంజాన్(ఈద్‌ఉల్ ఫితర్) పర్వదినం సందర్భంగా జిల్లా ముస్లిం సమాజానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు పాటిస్తూ ఆధ్యాత్మికంగా శుద్ధి చెందుతూ పండగను జరుపుకోవటం ఎంతో గొప్ప సాంప్రదాయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు, శ్రద్ధాసక్తులతో జరుపుకునే ఈ పర్వదినం వారికి అత్యంత ప్రాముఖ్యత కలిగినదని తెలిపారు.

మహ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సత్యం, సహనం, దయ, కరుణ వంటి విలువలు ఎల్లప్పుడూ మానవాళికి మార్గదర్శకాలన్నారు. ఈద్‌ఉల్‌ఫితర్ పండగను కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ముస్లిం సోదర సోదరీమణులు కోరారు.

## జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు గోలేటి క్రీడాకారులు




**ప్రజాపక్షం/రెబ్బెన :** జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరిగే 25వ జాతీయ స్థాయి సెపక్ తక్రా అండర్ 14 పోటీలకు గోలేటి గ్రామానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుండి 26 వరకు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నట్లు జిల్లా సెపక్ తక్రా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమ్మరి మల్లేష్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారిలో గోలేటి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీవల్లి, వనపర్తి అఖిల (విద్యా భారతి హైస్కూల్ తాండూర్), తాండూర్ హాసిని, గోరంట్ల శివకుమార్ (సింగరేణి హైస్కూల్ గోలేటి) ఉన్నారని పేర్కొన్నారు. ఇంతకుముందు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటిలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో వీరు బ్రౌంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పి.శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కె.భాస్కర్, ఆర్.రామకృష్ణ అభినందించారు. అలాగే జిల్లా ఒలింపిక్ వర్కింగ్ అధ్యక్షులు ఆర్.నారాయణ రెడ్డి, జిల్లా సెపక్ తక్రా వైస్ ప్రెసిడెంట్ ఎస్.తిరుపతి, కమిటీ సభ్యులు పి.సాంబయ్య, పి.సదానందం రెడ్డి, సతీష్, జి.అనిల్ గౌడ్, శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు రాజేందర్, వెంకటేష్, రాజశేఖర్, గోపి, తిరుమలేష్, శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మహద్ సత్యాగ్రహ దినోత్సవం



**ప్రజాపక్షం / వాంకిడి :** సమానత్వం, మానవ హక్కుల కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేపట్టిన మహద్ సత్యాగ్రహం సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 99వ మహద్ సత్యాగ్రహ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రార్థనలు చేశారు. అనంతరం అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 1927 మార్చి 20న మహారాష్ట్రలోని మహాడ్ పట్టణంలో చవ్దార్ చెరువు నీటి హక్కు కోసం అంబేద్కర్ నాయకత్వంలో ఈ చారిత్రాత్మక పోరాటం జరిగిందని గుర్తు చేశారు. దళితులకు నీటి హక్కుతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పించిన గొప్ప ఉద్యమమని కొనియాడారు. జిల్లా ఉపాధ్యక్షులు వినేష్ ఉప్రే, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగా జరిగిన ఈ సత్యాగ్రహం ద్వారానే మనిషి హక్కులు అందరికీ సమానమని అంబేద్కర్ చాటిచెప్పారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దుర్గం దుర్గాజి, సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, కార్యదర్శి రామ్టెంకి ప్రతాప్, ఉపాధ్యక్షులు శ్యామ్ రావు దొండుజి దుర్గే, కుల పెద్దలు శ్యామ్ రావు లహుజీ దుర్గే, నాయకులు రాజేశ్వర్, ప్రకాష్ ఉప్రే, విఠల్, రమేష్, మనోజ్, ధర్ము అప్రే, బల్వంత్ ఉప్రే, ఇంద్రజిత్ ఉప్రే పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్




**ప్రజాపక్షం / నస్పూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే నెరవేర్చాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ పిలుపు మేరకు శుక్రవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని, ఎకరానికి ఏడాదికి 15,000 రూపాయల చొప్పున బకాయి ఉన్న బిల్లులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రూ. 2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో వర్తింపజేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని నమ్మించి ఇప్పుడు రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, మాజీ ఎంఎల్ఏ అమరాజుల శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోయల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల ప్రజల విశ్వాసాన్నిపొందేవిధంగా పనిచేయాలి

### పోలీసు కమిషనర్ సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పోలీసు సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తు, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలని నిజామాబాద్ పోలీసుకమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ సౌత్ రూరల్ మోపాల్ పోలీసు స్టేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తూ, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలన్నారు. ఈ సందర్బంగా పోలీసు స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరును, పోలీసు స్టేషన్‌కు సంబంధించిన బొలేరో వాహనం, పెట్రోలింగ్ వాహనం పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోలింగ్ వాహనంలో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్ సామాగ్రి తనికీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా పోలీసు శాఖ పనితీరును మెరుగుపరచడం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ సౌత్ రూరల్ ఇన్స్‌పెక్టర్ ఎన్.సురేష్‌కుమార్, ఎస్ఐ జడ్. సుస్మిత, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండంలోని బీజేపీ ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ బంజారా నాయకుల ఆధ్వర్యంలో సేవలాల్ మాలధారణ వేసిన సేవలాల్ మహారాజ్ భక్తులు భోగ్‌బండార్ నిర్వహించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు సకల సిరి సంపదలు మంచి ఆరోగ్యాన్ని కల్పించాలని బంజారా ఆరాధ్య దైవం శ్రీ జగదాంబ మాత సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ రాంరావ్ మహారాజ్ అర్చన పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మండల అధ్యక్షురాలు గంగోని మదారి మమత, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం బీజేపీ పార్టీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులు బండి మహిపాల్ కేక్ కటింగ్ చేసి సంబరాలు జరిపారు. సర్పంచ్ బడుగు సత్యనారాయణ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు గంగోని మమతా రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ కోవూరు వడ్డెన్న, మాజీ వైస్ఎంపీపీ ఆడేందర్, బోంకన్‌పల్లి గంగాధర్, గంగారెడ్డి, రమేష్, నర్సింగరావు, నరేష్‌గౌడ్, బబ్బిత్‌గౌడ్, హరీష్, ప్రభాకర్, వినోద్‌నాయక్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పెన్షనర్లకు తీవ్రంగా నిరాశ పరిచింది

### ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రామ్మోహన్‌రావు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పెన్షనర్లకు తీవ్రంగా నిరాశ పరిచిందని నిజామాబాద్ జిల్లా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె. రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం సుభాష్ నగర్ నందిని పెన్షన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెన్షనర్లకు పిఆర్‌సి, డిఏ, రిటైర్మెంట్ బకాయిలు చెల్లించటానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు ప్రకటించలేదు, ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఈ బడ్జెట్ పెన్షనర్లను నిరాశకు గురిచేసిందన్నారు.

## విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వని తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలోని విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే 8 శాతం మాత్రమే కేటాయించారని, ఆరోగ్యానికి 4 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. కొత్తగా ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేయలేకపోయిందని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భర్తీలపై స్పష్టత లోపించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బడ్జెట్ కేవలం అసెంబ్లీ ప్రసంగాలకి పరిమితం కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ తరపున కోరుతున్నామన్నారు.

## మహిళా సంఘాలకు పెరటికోడి పిల్లల పంపిణీ

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల కేంద్రంలోని జ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం స్వయం సహాయక సంఘ సభ్యులకు పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. DAY NRLM CIF నిధుల ద్వారా సుమారు 200 యూనిట్లకు సంబంధించి సోనాలి రకం కోడిపిల్లలను స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, స్థానిక సర్పంచ్‌ఒరుగల అరుణ శ్రీనివాస్‌కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, అదనపు ఆదాయం పొందేందుకు పెరటికోళ్ల పెంపకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా సోనాలి రకం కోళ్లు త్వరగా పెరుగుతాయని, వీటి పెంపకం ద్వారా మహిళా సంఘాల సభ్యులు లాభాలు గడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో APM అంబాల రవివర్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు రూపకల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాట్ల విజయభాస్కర్, CCలు గుర్రం తిరుపతి, పిట్టల స్వామి, మెరుగు శశికుమార్, తడగొండ యేసుమణి, MS అకౌంటెంట్ ఉప్పుల రాములు, VOAలు కవిత, తిరుపతమ్మ, విమల, రజిత ,మహిళా సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సీలం కవితరెడ్డిని సన్మానించిన జిల్లా ప్రెస్‌క్లబ్

ప్రజాపక్షం/నిజామాబాద్ : డాక్టర్ సీలం కవితరెడ్డి ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిజామాబాద్ వారి స్వగృహంలో జిల్లా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేసి శాలువతో సన్మానించి మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యమందేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్స్టిట్యూట్‌ను మరింత అభివృద్ధి చేస్తానని డాక్టర్ కవితారెడ్డి పేర్కొన్నారు. మీడియా మిత్రుల సూచనలు సలహాలతో కార్యాచరణ రూపొందించి జిల్లాకు ఏమి అవసరమనే విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి వాగ్మారి సుభాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రాజు, జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు,సభ్యులు జయపాల్, రవికుమార్, సుదర్శన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నెహ్రూ నగర్‌లో రంజాన్ తోఫాల పంపిణీ

ప్రజాపక్షం/ఎడపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామంలో మానవీయత చాటుకున్నారు ఉప సర్పంచ్ ఇమ్రాన్ ఖాన్. తన సొంత నిధులతో గ్రామంలోని 500మంది పేద కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఒక్కో తోఫాలో 20 రకాల నిత్యావసర సరుకులను అందజేయడం విశేషం. పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టానని ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. అయితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపిటీసీ స్థానానికి తమ అభ్యర్థిని గెలిపిస్తే వచ్చే సంవత్సరం రంజాన్ మాసంలో వెయ్యి మందికి రంజాన్ తోఫాలను అందచేస్తానని తెలిపారు. తాము ఎన్నికైన మూడు నెలల్లో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారాలు చేపట్టడం జరిగిందన్నారు. స్థానికులు ఆయన సేవలను అభినందించారు. స్థానిక మైనార్టీ ముస్లిం మైనార్టీ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ దుకాణ సముదాయాలకు వేలం పాట

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మే నెల 16న అమావాస్య శనివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ వేణు పేర్కొన్నారు. ఈ మే నెల 16న ఆలయం వద్ద సైకిల్ స్టాండ్ నిర్వహణకు, కొబ్బరి కాయలు, లడ్డు ప్రసాదం విక్రయానికి బుధవారం వేలంపాట నిర్వహించారు. కొబ్బరి కాయల, నవదాన్యాల దుకాణం కోసం ర ఊ. 51వేలకు నిజామాబాద్ కు చెందిన రవీందర్ దక్కించుకున్నారు. లడ్డు, పులిహోర ప్రసాదం కోసం రూ. 49వేలకు నిజామాబాద్‌కు చెందిన నితిన్ అనే వ్యక్తి దక్కించుకోగా, సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు రూ.5,500కు జంకంపేటకు చెందిన అజయ్‌లు వేలం పాటలో దక్కించుకున్నారు.

## ఇంటిపై దాడిని ఖండించిన తెలంగాణ లోకల్ ఫోర్స్

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ లోకల్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మందుల సామేల్ నివాసంపై బిజెపి నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ టిఎల్ఎఫ్ వ్యవస్థాపన అధ్యక్షులు డల్లా సురేష్ మహజన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల కండువాలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డల్లా సురేష్ మహజన్ మాట్లాడుతూ.. బిజెపి రాష్ట్ర నాయకత్వం తీరును తీవ్రంగా తప్పుబట్టారు. బిజెపి నాయకులు వెంటనే ఎమ్మెల్యే మందుల సామేల్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ భవిష్యత్తులో మాదిగ ప్రజాప్రతినిధులపై ఇలాగే మతతత్వ ధోరణిలో దాడులకు పాల్పడితే, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. మాదిగ సమాజంపై దాడులు చేస్తామంటే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బిజెపికి మందకృష్ణ



మాదిగ మద్దతుగా ఉన్నారనే భ్రమలో ఆ పార్టీ ఉంటే, అన్యాయాన్ని చూస్తూ మాదిగ సమాజం ఊరుకోదని పేర్కొన్నారు. ఈ నిరసనలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుద్ధ పోశెట్టి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దొబ్బల సాయి కుమార్, టిఎల్ఎఫ్ నాయకులు వార్డు మెంబర్ సాయి చిరు, పి.రమేష్ మాదిగ, బాలరాజు మాదిగ, బొప్పురం అబ్బులు మాదిగ, బానపల్లి పోశెట్టి మాదిగ, సాయి కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా స్టేట్ లీగ్ వూషు పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్, జైతాపూర్‌కు చెందిన క్రీడాకారిణులు అస్మిత ఖేలో ఇండియా స్టేట్ లీగ్ 2025 26 వ ఊషు పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చిన, పలు పతకాలను కైవసం చేసుకున్నారు. మార్చి 14, 15వ తేదిలలో నిర్మల్ జిల్లా బైంసా వేదికగా జరిగిన ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటారు. ఈ పోటీల్లో భాగంగా సండా, తావోలు విభాగాల్లో జిల్లా క్రీడాకారిణులు పతకాలను సాధించారు. సండా విభాగంలో జైనబ్ గజాలి, బుసారి దివ్యలు కాంస్య పతకం, ఆఫియా జబీన్ రజత పతకం సాధించగా, తావోలు విభాగంలో ఫరియా ఖానం స్వర్ణ పతకం, దండు స్నేహ, సుంకపల్లి అనుజ, డి మనస్వని, దండు వర్ష, సుంకపల్లి జోష్న, బొగ్గుల వర్షిణి, షేక్ మహక్ కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారుల ఈ విజయ ప్రస్థానంలో కోచ్‌లు అబ్దుల్ ఓమర్, మహ్మద్ ఇర్షాద్ అలీల పాత్ర కీలకం. వారి నిరంతర కృషి, సరైన



మార్గదర్శకత్వం వల్లే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించగలిగారని క్రీడాభిమానులు ప్రశంసించారు. ఈ విజయం జైతాపూ, నిజామాబాద్ వాసులకు గర్వకారణంగా నిలవడమే కాకుండా, వూషు క్రీడ పట్ల యువతలో పెరుగుతున్న ఆసక్తిని క్రీడాకారుల అంకిత భావాన్ని చాటిచెప్పింది.

## భూ సమస్యల పరిష్కారమే థాను నాయక్‌కి నిజమైన నివాళి

ప్రజాపక్షం/కరీంనగర్: గిరిజనులు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు తాను నాయక్ కి అర్పించే నిజమైన నివాళి అని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమాసాహెబ్ అన్నారు. నేడు రాంనగర్ లో నిర్వహించిన తాను నాయక్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని చిత్రపటానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్ నాయక్ తో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి వెబ్సైట్ వల్ల గిరిజనులు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం భూభారతి వెబ్సైట్లో భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మార్వో స్థాయి వరకు పాస్వర్డ్ ఇవ్వాలని కోరారు.. అలాగే పహానిలో కాస్తు కాలాన్ని కూడా తిరిగి పునరుద్ధరించాలని అన్నారు.. రాష్ట్రంలో 12 లక్షల మంది సాదా బైనామాలు రెగ్యులర్ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని



కోరారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తీసి వేయాలని అన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నైజాం రజాకర్ల అరాచకాలను ఎదిరించి 1950 మార్చి 20న తాను నాయక్ ప్రాణాలర్పించారని అన్నారు. వారి స్పూర్తితో గిరిజన యువత ప్రజలు సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు శివరాజ్, నగర అధ్యక్షులు ప్రకాష్ నాయక్, నాయకులు నాగరాజు, అనిల్, రాజ్ కుమార్, రమేష్, సురేష్,శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపి ఈటెల జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/వీణవంక: వీణవంక మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు మండల బిజెపి నేతలు గాలేటి సురేందర్ రెడ్డి, పూదరి అనిల్ ల ఆద్వర్యంలో బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ పెద్ది మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎనగంటి విజయ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి ఈటెల అని కొనియాడారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపుల పెంచాలి

ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ (2026–27 )బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి కేటాయింపులు నిరాశాజనకంగా ఉన్నాయని జార్జిరెడ్డి పి.డి.ఎ. యూజిల్లా అధ్యక్షులు రత్నం రమేష్ అన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులు సుమారు రూ 8500 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు.దేశ భవిష్యత్ ను నిర్మించే విద్యారంగానికి తక్కువ కేటాయింపులు చేయడం అన్యాయం అని వారు అన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ కేవలం జీతాలు, వేతనాలు, పెన్షన్ ల చెల్లింపుల ఆవేదన వ్యక్తం చేశారు.

## పదో తరగతి ప్రశ్నా పత్రం లీక్ వ్యవహారంపై విచారణ

### సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాపక్షం/బోధన్: బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి ప్రశ్న పత్రం వైరల్ అయినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని విచారణలో తేలింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ప్రశ్నపత్రం బయటకు రాలేదని నిర్ధారణ కావడంతో, సస్పెండ్ అయిన చీఫ్ సూపరింటెండెంట్ కె.వేణు, ఇన్విజిలేటర్లు ఎ.శివానంద రావుల సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు డీఈఓ అశోక్ ప్రకటించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు.

## కారులో నుంచి రూ.3లక్షల చోరీ

ప్రజాపక్షం/బోధన్: కారులో ఉంచి నగదు 3లక్షల రూపాయాలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన బోధన్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో గల గోశాల రోడ్‌లోని యూనియన్ బ్యాంక్‌లో మూడు లక్షల రూపాయాలను డ్రా చేశానని, అనంతరం నగదును కారులో ఉంచి పని నిమిత్తం మళ్లీ బ్యాంకులోకి వెళ్లానని అన్నారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు హరిబాబు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పట్టణ సీఐ వెంకట్ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీకా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అమలు చేయాలి

### సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ప్రజాపక్షం/బోధన్: టీకా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఆరోగ్య అధికారులతో సమన్వయం చేయాలని సిబ్బంది బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. సానిటరీ ప్యాడ్ల లభ్యత గురించి విచారించి, అవి అందుబాటులో లేవని గమనించారు. మరుగుదొడ్ల సంఖ్య తగినంత లేవని సబ్ కలెక్టర్ గురించారు. సరైన ప్రమాణాలు పాటిస్తూ, విద్యార్థుల సంక్షేమాన్ని నిర్ధారించేందుకు అవసరమైన సూచనలు జారీ చేశారు. వర్ని తహసీల్దార్,సిబ్బంది ఉన్నారు.

## కార్మికుల సంక్షేమాన్ని మెరుగు పర్చేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/బోధన్: ఇటుక బట్టీలలో పని చేసే ప్రతి కార్మికుల సంక్షేమాన్ని మెరుగు పర్చేలా తగు చర్యలు తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మండల అధికారులకు సూచించారు. శుక్రవారం వర్ని మండలం జాకోరా, హుమ్నాపూర్ గ్రామాలలోని ఇటుక బట్టీ ప్రాంతాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. కూలీలతో ఇంటరాక్ట్ అయి, వారు లేబర్ కార్డుల కోసం నమోదు చేసుకున్నారా..? అని విచారించారు. చాలా మంది కార్మికులు నమోదు కాలేదని గమనించారు. జిపిఒ ని నియమించాలని, అర్హులైన వారికి వీలైనంత త్వరగా లేబర్ కార్డు నమోదు చేసేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. బట్టీలలో సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, సరైన జీవన పరిస్థితులు, కార్మికుల శ్రేయస్సును నిర్ధారించడానికి ఎఎన్ఎంల ద్వారా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయాల్సిన ఆదేశించారు.

## శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా ట్రెడిషనల్ డే వేడుకలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ లో ఘనంగా ట్రెడిషనల్ డే వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ పల్లె రాజు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు భారతదేశ సాంప్రదాయం యొక్క గొప్పతనం కళ్ళ కద్దినట్టు సాంప్రదాయ దుస్తులు ధరించి చూపరులను ఆకట్టుకున్నారు. సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పల్లె రాజు రెడ్డి మాట్లాడుతూ, మన సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ విలువలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమా, నవీన్, బాబు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.